# మా పప్పీ.. జాగ్రత్త!

- యానిమల్ కేర్ సెంటర్లకు పెరుగుతున్న ఆదరణ
- రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు వసూలు
- చలి, ఎండా కాలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- పెంపుడు జంతువుల యజమానులకు భరోసా

● 'సార్.. మా పప్పీని జాగ్రత్తగా చూసుకోండి. నాలుగు రోజుల్లో తిరిగి వచ్చేస్తాం' ఓ పెంపుడు జంతువు యజమాని విన్నపం.

● 'మా జెస్సీ (పిల్లి పిల్ల)ని మీపై నమ్మకంతో వదిలిపెట్టి వెళ్తున్నాం. దాని తిండిపై కాస్త శ్రద్ధ పెట్టండి' మరో పిల్లి ప్రేమికురాలి విజ్ఞప్తి.

ఇవీ యానిమల్ కేర్ సెంటర్ల దగ్గర వినిపిస్తున్న మాటలు. రెండ్రోజులు పెండ్లికి వెళ్లాలన్నా, నాలుగు రోజులు విహార యాత్రకు వెళ్లి రావాలన్నా భయపడే వారు జంతు ప్రేమికులు. ఎందుకంటే ఎంతో ప్రేమగా, తమ పిల్లలతో సమానంగా పెంచుకునే పెంపుడు జంతువులను వెంట తీసుకెళ్లలేక, ఇక్కడే ఒంటరిగా వదల్లేక సతమతమయ్యేవారు. ఇంట్లోనే ఒకరు ఉండాల్సిన పరిస్థితి కూడా ఉండేది. ఇంకొందరు అలాంటి యాత్రలకే వెళ్లే వారు కాదు. కానీ అలాంటి అన్ని సమస్యలకు పరిష్కారం లభించింది. పరిమిత కాలం పాటు పెంపుడు జంతువుల సంరక్షణను చూసేందుకు యానిమల్ కేర్ సెంటర్లు వెలిశాయి. ఇటీవల వీటికి మరింత ఆదరణ లభించింది. కరోనా తర్వాత పెంపుడు జంతువులు పెంచుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నదని కేర్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 9



యానిమల్ కేర్ సెంటర్‌లో వసతులు





కుక్క పిల్ల

వివిధ రకాల పిల్లులు,





నల్ల కుక్క పిల్ల

## సరైన ఆహారం.. మంచి వాతావరణం

పెంపుడు జంతువుల యజమానులు ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినా, ఇతర ఏ సందర్భంలోనైనా ఇంటిని విడిచి రెండుమూడు రోజులు వెళ్లాల్సి వస్తే చాలు ఠక్కున దగ్గరలోని యానిమల్ కేర్ సెంటర్‌ను సంప్రదిస్తున్నారు. తాము ప్రేమగా చూసుకునే కుక్కలు, పిల్లులను అక్కడ వదిలేస్తున్నారు. వదిలే సమయంలో సెంటర్ నిర్వాహకులకు కొందరు పెద్ద మెనూనే ఇస్తున్నారు. అవి రోజూ తినేలా ఆహారం సిద్ధం చేయాలని సూచనలు చేస్తున్నారు. మరికొందరు నేరుగా వండి తీసుకొచ్చి ఇచ్చేస్తున్నారు. కొందరు పెడిగ్రీలాంటివి పెట్టాలని చెబుతున్నారు. చాలామంది చికెన్ రైస్ వడ్డించాలని సూచిస్తున్నారు. పెంపుడు జంతువులు ఉండేందుకు అన్ని సదుపాయాలు ఉన్న సెంటర్లనే ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నారు. యానిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత చట్టం ప్రకారం లైసెన్సు తీసుకుని ఉండాలి. ఆ లైసెన్సు రెండేండ్లకోసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. యానిమల్ వెల్ఫేర్ ఏడీ సెంటర్‌ను తనిఖీ చేశాకే ఆ లైసెన్సు రెన్యూవల్ చేస్తారు. బ్రీడింగ్ సర్టిఫికెట్ సైతం తీసుకుంటారు. అలాంటి సర్టిఫికెట్ తీసుకున్న సెంటర్లలోనే నాణ్యమైన బ్రీడ్‌లు అందుబాటులో ఉంటాయి. కొందరు మాత్రం ఎలాంటి లైసెన్సులు లేకుండా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే సెంటర్లను నడిస్తున్నారు. మరికొందరు ఇండ్లలోనే బ్రీడ్‌లు తయారు చేస్తున్నారు. వీటిలో నాణ్యమైన బ్రీడ్ ఉండకపోవొచ్చని పలువురు సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో కుక్కను సంరక్షించేందుకు రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు తీసుకుంటున్నారు. కొందరు నిర్వాహకులు అందులోనే ఆహారం సైతం అందజేస్తున్నారు. అయినప్పటికీ, పెంపుడు జంతువులను ప్రేమగా చూస్తే చాలు అంటున్నారు యజమానులు. ఇలాంటి సెంటర్లతో కొంత ఉపశమనం కలుగుతున్నదని చెబుతున్నారు. బ్రీడ్‌లను బట్టి ఆహారం అందజేస్తామని, అందుకు తగ్గట్టే డబ్బులు వసూలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

## చలికాలం హీటర్లు.. ఎండల్లో కూలర్లు

యానిమల్ కేర్ సెంటర్లలో పెంపుడు జంతువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. పెంపుడు జంతువుల యజమానుల విజ్ఞప్తులు, డిమాండ్‌లకు అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నారు. చలికాలంలో కుక్కలకు ప్రత్యేకంగా హీటర్లు ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారు. ఎండాకాలంలో వాటికి కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో పెంపుడు జంతువుకు ఒక్కో గది కేటాయిస్తున్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ప్రతి గదిని నిత్యం కడుతుంటారు. గదులు ఎంత శుభ్రంగా ఉంటే పెంపుడు జంతువులు అంత ఆరోగ్యంగా ఉంటాయని సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

## కరోనాలో గడ్డుకాలం.. ఆ తర్వాత మంచి కాలం

కరోనా మొదటి వేవ్ సమయంలో యానిమల్ కేర్ సెంటర్లకు గడ్డు కాలమే నడిచింది. ఆ సమయంలో ఎవరూ పెంపుడు జంతువులను తీసుకురాలేదని, కొత్త బ్రీడ్‌లను ఎవరూ కొనుక్కోలేదని సెంటర్ల నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే, కరోనా రెండో వేవ్ సమయంలో మాత్రం ఎక్కువ మంది పెంపుడు జంతువులు కొనేందుకు ఆసక్తి ప్రదర్శించారట. ఇంట్లో ఒంటరిగా ఉండలేక ప్రేమగా పెంపుడు జంతువులను పెంచుకున్నారని చెబుతున్నారు. అందుకే ఆ సమయంలో వివిధ రకాల పెంపుడు జంతువులు కొనే వారి సంఖ్య కూడా బాగా పెరిగిందని అంటున్నారు.



## పెంపుడు జంతువులంటే ప్రేమ

జంతు ప్రేమికులకే ఈ సంరక్షణ చూడడం వీలవుతున్నది. నా భార్యకు పెంపుడు జంతువులంటే ప్రాణం. అదే నాకూ ఇష్టంగా మారింది. అందుకే 20 ఏండ్ల కిందట యానిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశా. వాటితో గడపడాన్ని సంతోషంగా భావిస్తా. మా పిల్లలతో కలిసి వాటిని బాగా చూసుకుంటా. నా దగ్గర దాదాపు 60 వరకు కుక్కలు ఉంటాయి. పిల్లులు కూడా వివిధ రకాల బ్రీడ్‌లు ఉన్నాయి. పెంపుడు జంతువుల యజమానులకు సంబంధించినవి సరాసరి దాదాపు 10 వరకు ఉంటాయి. వాటికి రోజూ చికెన్ రైస్ పెడుతుంటాం. కొందరు యజమానులు మాత్రం పలానా ఆహారమే పెట్టాలని చెబుతుంటారు. అందుకు తగ్గట్టే ఏర్పాట్లు చేస్తుంటాం. వాటి సంరక్షణలో ఆత్మ సంతృప్తి ఉన్నది.

**- జీ మధుసూదన్‌రెడ్డి, జేఎస్ఎస్ ఫామ్స్ అండ్ కెన్నెల్స్ నిర్వాహకుడు, మర్రిపల్లి, పెద్దఅంబర్‌పేట**



కేర్ సెంటర్‌లో కుక్క



సాగు చేసిన కంది చేను

# పూత కాలం.. సస్యరక్షణే మేలు

రైతుల అప్రమత్తతతోనే నష్ట నివారణ

వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి

సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి

**ప్రస్తుతం పూత దశలో కంది.. తెగుళ్లు సోకే ప్రమాదం**

**కంది సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే సరైన దిగుబడులు వస్తాయి. పైరును ఆశించే పురుగులు, తెగుళ్లను సరైన సమయంలో గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది చేలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉన్నదని, రైతులు అప్రమత్తతో నిష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. క్రిమిసంహారక మందులను మోతాదు తగ్గట్టు వాడితే అధిక దిగుబడి వచ్చి, ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు.**

**-న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 9**

కంది పంటలో పూత దశ కీలకమైనది. ఈ సమయంలో నీటి ఎద్దడి ఉన్నా, అవసరానికి మించి ఎక్కువ తడి ఇచ్చినా పూత రాలి దిగుబడి తగ్గుతుంది. ఈ క్రమంలో పూత దశలో ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పూత రాలుడు నివారణకు 8-10 లీటర్ల నీటికి ప్లానోఫిక్స్ 2మి.లీ. చొప్పున కలిపి 10రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పంటకు రోగాలు సోకిన వెంటనే రైతులు గుర్తించి మీకు చేరువలో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలి.

### పూత పెంకు పురుగు

కంది పూత దశలో ఉన్నప్పుడు ఎర్రని లేదా నారింజ రంగు మచ్చలు, నల్లని గీతలు ఉన్న పెంకు పురుగులు ఆశించి మొగ్గలను తింటాయి. దీంతో కాత తగ్గిపోతుంది. ఈ పురుగులను గమనించిన వెంటనే ఉదయం పూట వాటిని ఏరి మంటలో కాల్చివేయాలి.

### మారుకమచ్చల పురుగు

ఈ పురుగు లార్వాలు ఆకులను, పూతను, కాయలను కలిపి గూడులా చేసి తింటాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్, ఒక మి.లీ. డైక్లోరోవాస్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే 10లీటర్ల నీటికి స్పైనోసాడ్ 3 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

### ఆకుచుట్టు పురుగు

ఇది సాధారణంగా పంట పెరిగే దశలో ఆశించి నష్టపరుస్తుంది. కాని కొన్ని సమయాల్లో పూత దశలోనూ దీని ప్రభావం ఉంటుంది. లద్దెపురుగు పూత దశలో పూతను గూడులా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారు అయ్యేటప్పుడు మొగ్గలను దగ్గరగా చేర్చి గూడు కడుతుంది. కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలు తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం జరుగుతుంది. విత్తనం మొలకెత్తే దశలో ఈ పురుగు ఆశిస్తే పంటకాలం మొత్తం దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. తద్వారా పంట తీవ్రంగా నష్టపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.మి.లీ. చొప్పున కలిపి పూత దశలో పిచికారీ చేయాలి.

### పంట కోత నిల్వ

కంది కాయలు ఎండిన తరువాత మాత్రమే పంటను కోయాలి. కారణం పూత రెండు నెలల వరకు వస్తూనే ఉంటుంది. ఎండిన తరువాత కల్లెతో కొట్టి కాయల నుంచి గింజలను వేరు చేయాలి. కందులను బూడిదతో కలిపి గానీ, వేపాకు కలిపి గానీ నిల్వ చేయాలి. నిల్వ చేసేటప్పుడు పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండబెట్టాలి. ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల కంది పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు. రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు తీసుకుంటేనే అధిక దిగుబడి సాధించవచ్చు. పెట్టిన పెట్టుబడితో పాటు లాభాలు వచ్చే అవకాశం ఉన్నది. కంది సాగులో మంచి లాభాలు ఉన్నాయి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

# గజ.. గజ

- పెరిగిన చలి తీవ్రత
- బయటికి రావడానికి జంకుతున్న జనం

తుఫాన్ ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతున్నది. చల్లని గాలులు వీస్తుండడంతో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా దట్టమైన పొగమంచు కమ్మేసి ఉండడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు అవస్థలు పడుతున్నారు. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ సీజన్‌లో రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**- న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 9**



కమ్మేసిన పొగమంచు



పొగమంచులో లైట్ వేసుకుని వస్తున్న వాహనదారుడు

# పిచికారీ పైలం మరి

**వాణిజ్య పంటలతోపాటు ఇతర పంటలపై ఈ మధ్యకాలంలో రసాయన మందుల వాడకం పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందును ఆశ్రయిస్తున్నారు. పంట కాలంలో ఆరు నుంచి పదిసార్లు రసాయన మందులను పిచికారీ చేయడం ఆందోళనకరం. వాడే పద్ధతి తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. రసాయన మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని మద్నూర్ మండల వ్యవసాయాధికారి రాజు చెబుతున్నారు.**

**- న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 9**



ఆధునిక వ్యవసాయ విధానంలో దిగుబడులను పెంచుకునేందుకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగిపోయింది. ఎరువులు, క్రిమిసంహారక మందులు స్ప్రే చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మోనోక్రోటోపాస్, ఆక్సిడి మోటాన్, మిథైల్, ఆసిఫేట్ తదితర విషపూరితమైన మందులు పిచికారీ చేసే సమయంలో వాటి వినియోగ విధానంపై కచ్చితంగా అవగాహన ఉండాలని సూచిస్తున్నారు.

- క్రిమిసంహారక మందుల వినియోగంపై అవగాహన తప్పనిసరి
- అజాగ్రత్తగా ఉంటే ప్రమాదకరం
- తగు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు, వ్యవసాయ అధికారులు

### పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందుల పిచికారీకి ముందు వ్యక్తి తప్పనిసరిగా ముక్కు, కండ్లకు మందు తాకకుండా హెల్మెట్ లాంటిది తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకొనే సమయంలో చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, బీడీ, సిగరెట్ పీల్చడం లాంటి పనులు చేయరాదు.
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసిన తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు. సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన అవసరం.
- వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహా, సూచనలు పాటిస్తూ మందులను కొనుగోలు చేయాలి.



### నిర్లక్ష్యం వహించవద్దు

పంటలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమిసంహారక మందుల స్ప్రే తప్పనిసరైందే. కానీ, వాటిని వినియోగించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వాటి ప్రభావం ఆరోగ్యంపై పడుతుంది. పిచికారీ సమయంలో రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్తుంది. ప్రాథమిక చికిత్సకు అవకాశాలు తక్కువే ఉంటాయి. అత్యవసర చికిత్సయే శరణ్యం. రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి మందులను పిచికారీ చేయడం శ్రేయస్కరం. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కోసారి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే ఆస్కారం ఉన్నది.